1950లో

ప్రజాస్వామ్యం నూరుపాళ్లు

శ్రీపురోహిత్

కళారాధకమండలి అధ్యక్షులు అకస్మాత్తుగా కాలం చేశారు. పెత్తనానికి చేరుకున్నాడు. షష్టిపూర్తి జరిపించుకున్న మహానుభావుడు; ఏదో నాలుగు కాలాలపాటు బ్రతికి నానారకాలైన రుచుల్ని అనుభవించినవాడు; కీర్తిశేషుడయ్యాడుగదా, అంటే,— చెప్పొద్దూ,— ఎవరికీ అంతగా విచారం కలుగలేదు. అయితే, ఆయనతో పాటు మా కళారాధకమండలికూడా కీర్తిశేషత్వాన్ని పొందుతుందన్న యథార్థాన్ని మొదట్లో మేమెవ్వరం గుర్తించలేకపోయాం. మందమతులం! ఆయనగారి క్రియాకర్మలు యథావిధిగా జరిపించి, ఆ తరువాత మా మండలికి నూతనాధ్యక్షుణ్ణి ఎన్నుకోవలసిన తరుణం వచ్చింతరువాతగాని, చచ్చింది కేవలం మా అధ్యక్షులవారే కాదనీ, మా మండలి కూడా వారితోపాటు చావుకు సిద్ధమైందనీ, తుదకు కీర్తిశేషులైన మా అధ్యక్షులవారే అడ్డుపడి మా మండలి చావకుండా ఆకాస్తకీర్తీ నిలబెట్టారనీ, తెలిసొచ్చింది మాకు.

... ...

మండలి అధ్యక్షులు కాలంచేశారు. కాబట్టి మరొక అధ్యక్షుని ఎన్నుకోవలసిన బాధ్యత సభ్యులైనమా అందరిమీదా పడింది. అదృష్టమనండి, లేదా దురదృష్టమనండి. మామండలి సభ్యులపై ఇంతవరకూ ఇలాంటి బాధ్యత లెప్పుడూ పడివుండలేదు ప్రతి సభ్యుడికీ వోటింగు అధికారంవుందనీ ప్రజాస్వామ్యసూత్రాన్ననుసరించి అధ్యక్షుని ఎన్నుకోవచ్చుననీ, అవసరమనిపిస్తే దింపొచ్చుననీకూడా మాసభ్యులందరికీ తెలుసు. కాని ఆ విధానాల్ని ఆచరించవలసిన అవసరం ఈనాటివరకూ రాలేదు. అధ్యక్షుని అకాలమరణంమూలంగా తమకున్న ఈ హక్కుల్ని వినియోగించుకునేందుకు అవకాశం వచ్చినందుకు, ఒకవిధంగా అందరూ హర్షించారనే చెప్పాలి.

ఒకానొక శుభముహూర్తాన మా మండలి సభ్యులంతా నూతనాధ్యక్షుణ్ణి ఎన్నుకునే వుద్దేశ్యంతో, టౌన్ హాలులో సమావేశమయ్యారు! సమావేశాల లాంఛనాలు యథావిధిగా జరిగిపోయింతరువాత, ఒక పెద్ద మనిషి లేచి "మనమంతా కలిసి యెవరినైనా ఒక సభ్యుణ్ణి అధ్యక్షునిగా ఎన్నుకోవాల్సివుంది" అని ప్రకటించాడు. సభ్యుల్ని పేర్లు సూచించవలసిందిగా కోరాడు. వెంటనే హాలు నాలుగు మూలల నుంచి పేర్లవర్షం కురిసింది ... రంగయ్య, మంగయ్య, భుజంగరావు, కళింగరావు, ఆనందరావు, సదానందరావు, తుపాకుల నుండి మందుగుండ్లలాగా దూసుకువస్తున్నయ్ పేర్లు! "శాంతిస్థాపనార్థమై యుద్ధం చేయాల్సివుంటుంద"న్న లోకోక్తి ననుసరించి హాలులో జరుగుతూవున్న హంగామాను మించిపోయేవిధంగా చప్పట్లు కొట్టి, ఆ పెద్దమనిషి సభ్యుల్ని నిశ్శబ్దంగా వుం వలసిందిగా ప్రార్థించాడు . . సభ్యులంతా నిశ్శబ్దం

'లెక్చర్లు వినడానికి మేము రాలేద'ంటూ కొన్ని గొంతులు చేస్తున్న గోలను కూడా లక్ష్యపెట్టకుండా, ఆ పెద్ద మనిషి చిన్నపాటి ఉపన్యాసం ఇచ్చాడు. "ఒకరు ఒక పేరు సూచించడం, ఇంకొకరు మరోపేరు సూచించడం - ఇలాంటి హక్కు సభ్యులకు వున్నప్పటికీ దాని ఆచరణమూలంగా, ప్రజాస్వామ్యపు సూత్రం యొక్క ప్రథమావస్థలో నున్న సభ్యులందు కలత లేర్పడి, మండలిలో చీలికలు కలిగే ప్రమాదంవుంది కాబట్టి, సభ్యులంతా కలిసి యేదో ఒక పేరు సూచించాలి" అని ఆ ఉపన్యాసంలోని సారాంశం. సలహా బాగానేవుందని తలలూపారు సభ్యులంతా.

ఇంతలో ఒకమూలనుండి "రంగయ్యగారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం మంచిది" అని వినిపించింది. తక్షణమే కొన్ని హయగ్రీవాలు అందుకొన్నయ్ "అట్లా వీల్లే"దని.

"ఎందుకు వీల్లేదు ?"

"ఎందు కేమిటి ?. అంతే ! వీల్లేదు."

"సంగీతంలో రంగయ్య దక్షుడు."

"ఆ ! దక్షయజ్ఞానికీ, రంగయ్యసంగీతానికీ, ఇక వేరే చెప్పాలా ! "

"మీరంతా రంగయ్యని అవమానించడానికి పూనుకున్నారు."

"మేం కాదు; మూలనున్న రంగయ్యగారిని ముందుకు లాగి మీరే ఆపనికి పూనుకున్నారు "

"బ్రాహ్మలంతాచేరి కుట్ర పన్నుతున్నారు "

"కాదు; కమ్మవారంతా కలిసి గందరగోళం చెస్తున్నారు "

సంఘర్షణ ఇంకా దక్షయజ్ఞంలోకి దిగలేదు. ఇంకా వాగ్వాదసమరరూపంలోనే (Cord war) ఉంది. పాపం, ఏ మాట కామాటే చెప్పాలి ఆ రంగయ్యగారు ఎంతైనా వుత్తముడు కాబట్టి, అమాంతంగా సభామధ్యంనుండి లేచి, వేదిక వరకూ చేరుకుని, బహు వినయంగా చేతులు జోడించి "నేను అధ్యక్షపదవికి సిద్ధంగా లేనం"టూ ప్రకటించి, సంఘర్షణ సాయుధరూపం ధరించకుండా కాపాడాడు. లేకపోతే సభ్యుల్లో ఒకరిద్దరి బుర్రలైనా బ్రద్దలయ్యేవి.

సమావేశంలో వ్యవహారంఅంతా ముదిరిపోయింది తాత్కాలికంగా సభ్యులంతా శాంతంగా కనిపించినప్పటికీ, వాళ్ళ చూపుల్లో కోపాలు పరుగులిడుతూనే వున్నయ్. సంస్థ సంరక్షణ దృష్ట్యా, అధ్యక్షుని ఎన్నికల్ని వాయిదా వేద్దామని, పెద్ద మనిషి కోరాడు. అందరూ అంగీకరించారు. సమావేశం వాయిదా పడింది.

* * * *

మళ్ళీ నెల తరువాత సభ్యులమైన మేమంతా తిరిగి సమావేశమయ్యాం, అదే టౌన్ హాలులో. ఈతడవ అధ్యక్షుని ఎన్నిక ఏ విధంగానైనా జరిగిపోగలదన్న ఆశ మా అందరిలోనూ వుండింది. కాని జరగలేదు!

ఈ తడవ వచ్చిన పేరు గుప్తగారిది.

(39-వ పేజీ చూడుడు)

ప్రజాస్వామ్యం నూరుపాళ్లు

(14-వ పేజీ తరువాయి)

"ఏమిటా గుప్తగారిలో వున్న విశేషం?" అన్నది ఓ గొంతు.

"ఏమిటి ఆయనలో లేని విశేషం?" ఎదురడిగింది మరో గొంతు.

"వట్టి కళాహీనుడు!"

"కావచ్చు; కాని కళాభిమాని"

"అవును. బ్లాక్ మార్కెట్టు కళాభిమాని"

"బ్లాకు చెయ్యనివా డెవడంట!"

"బ్లాకుమార్కెట్టును జాతీయం చేయడానికి పూనుకున్నందుకు మేం తీవ్రంగా నిరసిస్తున్నాం."

"చేస్తుంటే తప్పులేదుగాని అంటే వచ్చిందీ!"

"ఎవరూ చేయడంలేదు; ఒక్క గుప్తగారు తప్ప"

"అందుకే గుప్తగారిపేరు ప్రతిపాదించబడింది." అంది మూడో గొంతు.

గడచిన సమావేశంలోని సంఘర్షణకూ, దీనికీ సామ్యం లేకపోవచ్చు; కాని స్వభావం మాత్రం ఒకటే. అందరికన్న మొదలు ఈ సంఘర్షణమూలంగా గుప్తగారికి గుబులు పట్టుకుంది. తనపై జరుగుతున్న ఈ చర్చ తన మంచికి కాకపోగా, తనపట్ల ప్రమాద కారణంగా పరిణమించే సూచన కనిపించింది...సభామధ్యంనుంచి లేచి, గబగబా వేదిక దగ్గరకు చేరుకుని "నాకొద్దు బాబో, ఈ అధ్యక్షుపదవి" అంటూ చేతులు జోడించాడు.

సమావేశంలో పెద్దమనిషికి ఎటూ పాలుపోలేదు. "మరెవరిపేరైనా సూచించండి" అని అనడంతప్ప మరేమీ చేయలేకపోయాడు ఈ తడవ ఆ పెద్దమనిషి పేరే సూచించబడింది. ఇక వ్యతిరేకత వుండబోదని ప్రతిపాదకుని విశ్వాసం.

"కళింగరావు ఈ పదవికి పనికిరాడు"

"కళింగరావుగారు సంగీతవిద్వాంసులు. వారే ఈ పదవికి సమర్థులు"

"విద్వాంసులు కావచ్చు; కాని సంగీతానికి చింతకాయలు రాలవ్" అన్నది గుప్తగారి గొంతు

"కళింగరావు కరణం!.. కరణపు పురుగు కళారాధకమండలి గద్దె ఎక్కడానికి వీల్లేదు." మద్దతిచ్చింది రంగయ్యగొంతు.

కళింగరావు లేచి, నాకు "ఈపదవి ఇష్టంలేదం"టూ సమావేశాన్ని తిరిగి వాయిదా వేశాడు.

* * *

మళ్లీ నెల తిరువాత అదే టౌన్ హాలులో సమావేశమయ్యాం. ఈ తడవ ఆ పెద్దమనిషి పేర్లు సూచించమని ఎవ్వరినీ అడగలేదు. రెండేవిషయాలు చెప్పాడు. ప్రతికున్న సభ్యుడెవ్వడూ అధ్యక్షుడు గావడానికి మన మెవ్వరమూ అంగీకరించం మనకు ఇక రెండే మార్గాలున్నయ్.. ఒకటి; మన మండలిని రద్దు చేసుకోవడం. రెండవది; కనీసం మన సంస్థనైనా దక్కించుకోవాలనుకుంటే నూతనాధ్యక్షునిఎన్నిక కార్యక్రమం మాని, కీర్తిశేషులైన అధ్యక్షులవారినే మనం అధ్యక్షునిగా భావించుకుంటూ పనిచేయాలి.

"ఆయన లేడుగదా!" అడిగింది ఓగొంతు.

"ఆయన బొమ్మే చాలు, ఈ విపరీత విపత్కర పరిస్థితులమధ్య మన సంస్థను సజీవంగా ఉంచడానికి" అన్నాడు కళింగరావు.

అందరూ చప్పట్లు కొట్టారు. మానం అంగీకారంగా తీసుకోబడింది.

* * *

కళింగరావు సమావేశంనుండి బయటకు రాగానే, పత్రికలవాళ్ళు చుట్టు ముట్టారు.

"ఏమైంది ఎన్నికల గొడవ?"

"అంతా చల్లారిపోయింది."

"అంటే?"

"ఎన్నికలే మానుకున్నాం!"

"మరి? .."

"కీర్తిశేషులైన మా పాత అధ్యక్షులే మాకు శాశ్వతాధ్యక్షులు"

"అలా జరిగిందేం? ."

"మంచిదేగా!. ప్రజాస్వామ్యానికి నూటికి నూరుపాళ్ళ విజయం!"

భాషల పుట్టుపూర్వోత్తరాలు

(28-వ పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యకళలో కూడా ప్రవేశించాయి.

వెనకటిరోజుల్లో గ్రంథపరిశీలన విజ్ఞానాభివృద్ధికోసం. నేడు పుస్తకాలు చదవడం-నూటికి తొంభైమంది విషయంలో కాలక్షేపంకోసం. రెండువందల ఏళ్ళక్రితం ఆంగ్ల రచయిత "చదవడమనేది ఖూనా వ్యాపకంగా ప్రజలు పరిగణిస్తున్నారు" అన్నాడు. ఆ మాటలు ఈనాటికూడా అక్షరాలా నిజం

సాహిత్యం ప్రజాస్వామ్యకళగా మారగానే, పద్యరచనకి ప్రోత్సాహం తగ్గి, వచనానికి ప్రచారం పెరిగింది. కళాకారుడు. ప్రజాభిరుచినిబట్టి వచనాన్నే ఆశ్రయించవలసవచ్చింది. కవిత్వం రసజ్ఞుల కళ అయింది.

వచనంలో కాలక్షేపానికి చదువుకునే పుస్తకాలు తయారయాయి. "నిత్యజీవితంలో తీరని కలలు పుస్తకాల్లో చదివి ఆనందపడతాడు పాఠకుడు" అంటారు కొందరు. ఈ అభిప్రాయంలో కొంత నిజం లేకపోలేదు. చదవడమనేది కూడా-కాఫీ, సిగరెట్లూ, సినిమా ఎలాగో-అలాటిదే ఒక అలవాటు. మెదడుకి పని చెప్పే అలవాటు కనక, 'ఇది దురలవాటు కాదు' అని మనం అంగీకరించాలి. 'తినగ తినగ వేము తియ్యనౌను' అన్నట్టు చదవగా చదవగా విజ్ఞానవంతుడు కావచ్చు.

విజ్ఞానాన్ని యివ్వవలసిన గ్రంథం కాలక్షేపాన్నిచ్చేదిగా తయారుకావడం వల్ల, అది విలువలోనూ అంతస్తులోనూ దిగిపోయింది. దేశానికయితే ఎల్లలున్నాయిగాని సాహిత్యాని కవి లేవు. సాహిత్యం యావత్ప్రపంచానికీ చెందుతుంది. దానికున్నదల్లా భాషానియమాలు.

సౌందర్యాన్వేషణలోనే సాహిత్యం వెలువడింది; వెలువడుతుంది. సౌందర్యం సర్వమానవకోటీ చెయిజాచి పొందగలిగే ధనం. కడివెడునీళ్లు తెచ్చుకుంటే చెరువు యింకిపోతుందా? అంత సౌందర్యం వుంది ఈ భూమండలంమీద. ఈ సౌందర్యానుభవానికి అర్హత కలిగించేదే సాహిత్యోపాసన. రసజ్ఞత మన హృదయంలో ఉండాలి; మన జ్ఞానేంద్రియజ్ఞానం పెరగాలి. ధనాపేక్ష కాక దయారసం మన జీవితాలని సరిదిద్దాలి. ఆనాడు లలితకళలలోని ఆనందం మనకి అనుభవమౌతుంది.

(అయిపోయింది)

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

శ్రీ ఎస్. ఆర్. చందూర్

నెరసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయనక్కరలేదు ఆయుర్వేద చికిత్స తెల్లనిరంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచెమై యుండిన రు. 2-8-0. 3 ఒకేసారి రు 6-8-0. మధ్యరకమై యుండిన, రు. 3-8-0, 3 సీసాలు ఒకేసారి రు. 9. పూర్తిగాయుండిన రు. 5/- 3 ఒకేసారి రు. 12/-

VIJOY LABORATORIES No. 14
P. O. Manoharpur (Singhbhum)